క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఎస్ఐ విశ్వనాథనాయుడు 'రోల్ ఆఫ్ యూత్ ఇన్‌ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జ్యోత్స్న, వైష్ణవి, హస్మిత ఎంపికయ్యారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల వలన యువకులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు



ఆధార్ నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

నాగలాపురం: స్థానిక అక్షర జూనియర్ కళాశాలో బుధవారం ఎంపీడీఓ బాలాజి నాయక్ పర్యవేక్షణలో డిజిటల్ అసిస్టెంట్ హరి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు బయోమెట్రిక్, చిరునామా, పుట్టిన తేదీ వంటి మార్పులు చేశారు. విద్యార్థులందరూ ఆధార్ క్యాంపులో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. అలాగే పాఠశాలలో కూడా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ఆయుధ పూజ



విద్యుత్‌శాఖ కార్యాలయంలో పూజలు చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం వైభవంగా ఆయుధపూజ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధికారి ఎస్ఈ సురేంద్రనాయుడు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, ఏర్పేడు, కేవీబీపురం మండలాలకుచెందిన ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కలవగుంట పంచాయతీ గుండ్లపల్లెలో బుధవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. రూ.6 లక్షలతో సీసీ రోడ్డును వేయనున్నట్టు ఆయన చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొదటిగా ఈ సభలో ఓ బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యానికి సీఎం సహాయనిధి మంజూరు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని పిచ్చాటూరు మండలం కారూరుకు చెందిన ప్రకాష్ కుమారుడు సి.నితీష్ (10) కొంతకాలంగా కాలేయ వ్యాధి సమస్యతో చికిత్స పొందుతున్నాడు. అతడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.7లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కారూరుకు వెళ్లి బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇలంగోవన్ రెడ్డి, సర్పంచ్ పద్దురాజు, పార్టీ నాయకులు కొల్లాపురి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం బైపాస్ బ్రిడ్జి వద్ద రహదారిపై గుంతలు



చిత్తూరుకండ్రిగ వద్ద హైవేపై పెద్ద గుంతలు



హైవే గోతులు..

పడితే పగులుతున్న మూతులు

ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వ కారణం.. గోతులు, కుచించుకుపోయిన రోడ్డు తప్ప అన్నట్టుగా ఉంది మండలంలో 716–ఏ నంబర్ జాతీయ రహదారి దుస్థితి. ఈ మధ్య కురిసన వర్షాలకు పలుచోట్ల జాతీయ రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతుకుల రోడ్డుపై అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గోతులు పూడ్చండి మహాప్రభో అని మొరపెడుతున్నారు.

- ఇదీ పుత్తూరు–చెన్నై 716–ఏ జాతీయ రహదారి తీరు
- ప్రమాదాల పాలవుతున్న వాహనచోదకులు
- గోతులు పూడ్చండి మహాప్రభో అంటున్న ప్రజలు

నారాయణవనం: పుత్తూరు నుంచి ఊత్తుకోట మీదుగా శ్రీసిటీ, తచ్చూరు కూడలి రోడ్డు(జీఎన్‌టి ఎన్‌హెచ్) వరకు 716–ఏ నంబర్ జాతీయ రహదారి చెన్నై, శ్రీసిటిలోని పరిశ్రమలకు లారీలతో నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని ఈ జాతీయ రహదారిపై వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. ఆదమరిస్తే మోటార్ సైక్లిస్టులు ప్రమాదాలకు గురై, షేపులు మారి, ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు కూటమి నేతలు రహదారుల్లో చిన్నగొయ్యి పడినా రాద్ధాంతం చేసేవారని, అధికారంలోకి వచ్చాక ధ్వంసమైన రహదారులు, రోడ్లలోని గోతులు కనిపించడం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం భారీ వాహనాలతో రద్దీ

మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి శ్రీసిటీకి వెళ్లే వాహనాలతో పాటు కడప, కర్నూలు జిల్లాల నుంచి ముడి ఖనిజాన్ని చెన్నై నౌకాశ్రయానికి తరలించే వాహనాలు ఈ మార్గం మీదుగా వెళ్తున్నాయి. ప్రధానమైన ఈ రహదారి పగుళ్లకు గురవుతోంది. దీనికితోడు నారాయణవనం బ్రిడ్జి, రాళ్ల కాలువ, చిత్తూరు కండ్రిగ, పాలమంగళంల వద్ద రోడ్డుపై వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనాలు గోతుల్లోపడి, అదుపుతప్పి పడిపోతున్నారు.

కనిపించని ఇంటికేటింగ్ లైట్లు

జాతీయ రహదారిపై రద్దీ కూడళ్లు, ఇరుకై న బ్రిడ్జిలు, స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహన చోదకులు అప్రమత్తంగాఈ వెళ్లడానికి ఆరెంజ్ కలర్ సోలార్ ఇండికేటర్ బ్లింకింగ్ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డు అంచులకు కమ్మేయడంతో ఇండికేటింగ్ లైట్లు కనిపించడం లేదు. దీంతో వేగంగా ప్రయాణించే వాహనాలతో ప్రమాదం పొంచి ఉంది. నారాయణవనం బైపాస్ బ్రిడ్జిపై మట్టి మేట వేయడంతో జారిపడి ప్రమాదానికి గురవుతున్నామని మోటార్ సైక్లిస్టులు వాపోతున్నారు. ఇక, జీఎస్ కండ్రిగ బ్రిడ్జి పిల్లర్లపై రబ్బర్ బెడ్‌లు తొలగి ఏర్పడ్డ గొయ్యితో ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే అధికారులే లేరు.



ముళ్ల చెట్ల మధ్య కనిపించని ఇండికేటింగ్ ఆరెంజ్ లైట్

రాత్రుల్లో వెళ్లాలంటే భయం

మండలంలోని జాతీయ రహదారిపై గోతులు పడటంతో రాత్రుల్లో రాకపోకలు సాగించాలంటేనే భయమేస్తోంది. మోటార్ సైకిళ్లు నడిపేవారు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో గోతులు కనబడక యాక్సిడెంట్లు ఎక్కువ జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలి.

–శివ, వాహనచోదకుడు, పాలమంగళం

అవస్థలు పడుతున్నాం

మండలంలో పుత్తూరు నుంచి పాలమంగళం వరకు జాతీయ రహదారిపై ప్రయాణించేవారు గుంతల వల్ల అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రుల్లో ఎంత జాగ్రత్తగా ప్రయాణించినా రహదారిపై తొలిసారిగా ప్రయాణించే వాహన చోదకులతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

–రోశయ్య, స్కూటరిస్ట్, తుంబూరు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీకి అర్హులైన ఎస్సీ, ఎస్టీల అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు ఈనెల 25వ తేదీ వరకు పెంచినట్లు శ్రీకాళహస్తి సహాయక సాంఘిక సంక్షేమ అధికారి ఆనందరావు బుధవారం తెలిపారు. మూడు నెలల కాల వ్యవధిలో ఇవ్వనున్న శిక్షణకు అర్హులైన వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి కల్పించనున్నట్టు తెలియజేశారు.

రాంబట్లపల్లెలో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం రాంబట్లపల్లెలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు, డీటీ రాఘవయ్య, సర్పంచ్ మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కార్యదర్శికి వీడ్కోలు సన్మానం



గ్రామ కార్యదర్శి స్వర్ణ మంజులను సన్మానిస్తున్న సర్పంచులు

బుచ్చినాయుడుకండ్రిగ(వరదయ్యపాళెం): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో బదిలీపై వెళ్లిన కొత్తపాళెం, పార్లపల్లె గ్రామాల కార్యదర్శి స్వర్ణమంజులకు బుధవారం పార్లపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచులు వెంకటసుబ్బయ్య, సుబ్బరత్నమ్మ ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాజ్‌వేకు మరమ్మతులు చేయరూ!



మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్న తుంబూరు కాజ్‌వే

నారాయణవనం: తుపాను మూలాన కురిసిన వర్షాలకు కోతకు గురైన తుంబూరు లో లెవల్ కాజ్‌వేకు మరమ్మత్తులు చేయలని స్థానికులు కోరుతున్నారు. ఏటా వర్షాలతో అరుణానది ఉధృతికి కాజ్‌వే కోతకు గురికావడం, మట్టి, ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం 2017 నుంచి పరిపాటిగా మారింది. గత వారం తుపాను వర్ష ప్రభావంతో అరుణానదిపై తుంబూరు కాజ్‌వేపై కట్ట కొట్టుకుపోవడంతో పైపులు బయట పడ్డాయి. మరోసారి నది ఉధృతంగా ప్రవహిస్తే పూర్తిగా కోతకు గురై రాకపోకలకు అవరోధం కలిగి పరిస్థితి ఉంది. అధికారులు దీనిపై దృష్టి సారించి మరమ్మతులకు పూనుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా దుకాణాలకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: దీపావళి పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు బుధవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి అధికారులతో కలిసి ప్రభుతాస్పత్రి రోడ్డులోని బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. 12 ఏళ్లుగా ప్రతి ఏటా ఇదే చోట టపాసుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే జనసంచారం పెరగడంతో పలువురు ఆక్షేపించిన నేపథ్యంలో అధికారులు స్థల పరిశీలన చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ సంవత్సరం ఇక్కడే దుకాణాలు కొనసాగిస్తామని, తరువాత స్థల పరిశీనల చేసి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఆపై వచ్చే ఏడాది నుంచి స్థల మార్పు చేస్తామన్నారు.

దళిత సంఘమిత్రల తొలగింపుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పెచ్చుమీరాయని సీఐటీయూ నాయకులు, పలువురు దళిత సంఘమిత్రలు మండిపడ్డారు. తొట్టంబేడు వెలుగు కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల గ్రామసభ తీర్మానం లేకుండానే దళిత సంఘమిత్రలను తొలగించడం చట్టవిరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులు తారాస్థాయికి చేరుకుంటున్నాయని, అధికారులు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తొలగిస్తూ ఉంటే చివరకు న్యాయస్థానాల్లో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం మణి, వెంకటేష్, సంఘమిత్రలుపాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీపీ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్–2005పై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది ప్రజ్ఞశ్రీ హాజరై విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం సాయంతో ప్రజలు ఎవరి నుంచైనా సమాచారం కోరవచ్చని, నిర్ణీత గడువు లోపు సమాచారం ఇవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, అధ్యాపకులు నాగయ్య, పరంధామయ్య, సతీష్‌కుమార్, వెంకట నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఇద్దరి మృతి



రేణిగుంట: కార్మికుడు అమర్ మృతదేహం



సత్యవేడు: రవి మృతదేహం

రేణిగుంట: తిరుపతి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ కర్మాగారంలో పని చేస్తున్న ఓ వలస కార్మికుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ కర్మాగాల సముదాయంలో ఉన్న ఓ ప్లాస్టిక్ అచ్చుల తయారీ కర్మాగారంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు అమర్(40) పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీలో అతను పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అయితే యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఫ్యాక్టరీలో ఎలాంటి సేఫ్టీ నిబంధనలను పాటించకుండా ఉన్నారని, అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

గొల్లపాళెంలో మరొకరు..

సత్యవేడు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్యవేడు మండలం గొల్లపాళెం దళితవాడలో చోటు చేసుకుంది. మండలంలోని గొల్లపాళెం దళితవాడకు చెందిన రవి(51) మంగళవారం రాత్రి భోజనం చేసిన తరువాత జంక్షన్ బాక్సుకు ఫ్యాన్ వైరు పెట్టి, స్విచ్ ఆన్ చేసుకుని, మంచంపై నిద్రించాడు. నిద్రలో జంక్షన్ బాక్సుపై చేయి వేయడంతో కరెంట్ షాక్ కొట్టి మంచంపై నుంచి కింద పడ్డారు. అతనిపై ప్లగ్ బాక్స్ పడడంతో మళ్లీ విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. గుర్తించిన కుటుంబసభ్యులు ఆయన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పేరుకే హెచ్చరిక బోర్డులు..ఆగని ఆక్రమణలు

- శోత్రియ భూముల్లో యథేచ్ఛగా దున్నకాలు, పంటల సాగు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



శోత్రియ భూముల్లో ట్రాక్టర్‌తో దున్నుతున్న ఆక్రమణదారులు

వరదయ్యపాళెం: ఆక్రమణలు జరిగిన చోట రెవెన్యూ యంత్రాంగం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఇటీవల నెల క్రితం మండలంలో చిన్న పాండూరుకు సమీపంలోని శోత్రియ భూముల్లో రాత్రికి రాత్రే దున్ని ఆక్రమించారు. అయితే ఆ సమయంలో రెవెన్యూ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఎవరైనా సంబంధిత భూముల్లో నిబంధనలు అతిక్రమించి ఆక్రమణలకు పూనుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. అయితే తాజాగా బుధవారం మరోమారు ట్రాక్టర్లతో పట్టపగలు దున్ని ఏకంగా పంట సాగుకు విత్తనాలు సైతం విత్తడం గమనార్హం! ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. అధికారులు మాటలన్నీ డాంబికాలే తప్పితే ఆచరణలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ దిశగా కఠిన చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదని అక్కడి స్థానికులు మండిపడ్డారు. చివరకు ఆలస్యంగా సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజశేఖర్ బుధవారం రాత్రి 7 గంటలకు శోత్రియ భూముల వద్దకు వెళ్లిన సమయంలో కూడా ట్రాక్టర్లతో దున్నుతుండడం చూసి ఆయన ఆగ్రహం వ్యక్త చేశారు. దున్నకం పనులు చేస్తున్న వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన భూమిలో ఆక్రమణలు చేసిన వైనం

లారీ ఢీకొని కారు డ్రైవర్‌కు గాయాలు



గాయపడ్డ కారు డ్రైవర్

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారును మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారుడ్రైవర్ (54)కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారులోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీలో మండల కమిటీ సమావేశం



సమావేశంలో మండల కమిటీ సభ్యులు

నాగలాపురం: స్థానిక పీహెచ్‌సీలో బుధవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సింధు మాట్లాడారు. పీహెచ్‌సీలో వైద్య సదుపాయాలు, రోగులకు అందిస్తున్న సేవలు, వైద్యశాలలో మందులు అవసరత..ఇత్యాది అంశాలపై వైద్యాధికారి విజయ్ కుమార్‌తో సభ్యులు చర్చించారు.

అత్యవసర పరిస్థితిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు చిన్నదొరై, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, ఎంపీడీఓ బాలాజి నాయక్, వైద్యాధికారి అరుల్ కిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుతో అధిక ఆదాయం



కొల్లడంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సత్యవేడు: రైతులు తక్కువ నీటి ఖర్చుతో వాణిజ్య పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి సతీష్ అన్నారు. బుధవారం కొల్లడం పంచాయతీలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, ఐదెకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో, అంత కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతుకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తామన్నారు. పూల తోటలు, వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ పరికరాలను వినియోగిస్తే సాగునీరు ఆదా అవుతుందన్నారు. 55 శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు ఇస్తామన్నారు. వరి సాగు, ఎరువుల యాజమాన్యంపై ఏఓ మురళి వివరించారు. కార్యక్రమంలో ఏడీఓ సుబ్రమణ్యం, ఉద్యానవన శాఖ అధికారిణి రాధారాణి, వెటర్నటీ డాక్టర్ దయాకర్‌బాబు, రైతులు కోదండం, వ్యవసాయ సహాయకులు మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కుంబాభిషేక మహోత్సవంలో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో వాంపల్లెలోని బాలత్రిపుర సుందరిదేవి సమేత కేదారేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులపాటు మహా కుంభాభిషేకం, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం వేద పండితులు కలశాలను ఏర్పాటుచేసి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూర తారక శ్రీనివాసులు హాజరై స్వామి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చొరవతో దేవాలయం కోసం స్థలం కేటాయించారు. ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడం అభినందనీయమని ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు నాయుడును అభినందించారు. కార్యక్రమంలో ఈశ్వర్ నాయుడు, మధు నాయుడు, వెంకటరత్నం , రెడ్డిపల్లె సర్పంచ్ వెంపల్ల సురేంద్ర యాదవ్, వైస్ ఎంపీపీ అక్కుపల్లి భానుమూర్తి యాదవ్, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజరెడ్డి, వెంకటరమణయ్య, తిమ్మవరం శేఖర్ యాదవ్, నక్క పెంచలయ్య, ఈగల హరిబాబు రాయల్ తదితరులు పాల్గొన్నారు.



అంజూరుకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు